సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి



కోల్‌కతాలో జరిగిన ఘటన పునరావృతం కాకుండా వైద్యులు, వైద్యసిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చట్టాలను అమలు చేయాలి. రాత్రి వేళ వైద్యశాలల్లో విధులు నిర్వర్తించే మహిళా డాక్టర్లు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలి. గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీలకు రాత్రి వేళ పోలీస్ సెక్యూర్టీ కల్పించాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా టాయ్‌లెట్లు, డ్రస్ ఛేంజింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, కలిగిరి పీహెచ్‌సీ

రాత్రి వేళ రక్షణ అవసరం



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మానవమృగాలను కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కావు. గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళ సెక్యూర్టీ లేని కారణంగా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి మహిళా డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలి.

– సీహెచ్ లక్ష్మీమాధురి, స్టాఫ్ నర్సు, జలదంకి పీహెచ్‌సీ

కఠిన చట్టాలు తప్పనిసరి



విధి నిర్వహణలో ఉన్న డాక్టర్లు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. సమాజంలో మహిళలపై జరిగే దారుణాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేయాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలందించే డాక్టర్లకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ కీర్తిప్రియ, కసుమూరు పీహెచ్‌సీ



క్లుప్తంగా

రామాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



మాట్లాడుతున్న వైద్యాధికారి

కొడవలూరు: మండలంలోని రామాపురంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి జనార్దన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అందరికీ వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్న వారి వద్దకెళ్లి వైద్య సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు సౌమ్య, రజిత, హెచ్‌ఏ సురేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఇన్‌చార్జి వీసీ తదితరులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక రంగంపై మక్కువ పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎస్‌ఆర్‌ఎం గ్రూప్ సంస్థల ఈడీ డి.నారాయణరావు స్పేస్ సైన్స్ ప్రాముఖ్యత, అప్లికేషన్ల గురించి వివరించారు. వీఎస్‌యూలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లైన్స్ ఇన్ గ్రీన్ ఎనర్జీ, విక్రమ్ శాట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, పోస్టర్ మేకింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

➡ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని వర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి పాటిస్తే అధిక దిగుబడులు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు తదితరులు

పొదలకూరు: వేరుశనగలో విత్తనశుద్ధి పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉందని పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.ప్రసన్నరాజేష్ సూచించారు. మండలంలోని సూరాయపాళెంలో వేరుశనగ పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇసుక నేలల్లో వేరుశనగ పండించే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులను కలిపి కలియదున్నాల్సిందిగా తెలిపారు. మొక్కల మధ్య ఎడం పాటిస్తే దిగుబడులు పెరుగుతాయని, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం కనుగొన్న వేరుశెనగ విత్తనాలను విత్తుకోవాల్సిందిగా సూచించారు. తెగుళ్ల నివారణకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎస్‌కే హసీనాభాను, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

కొడవలూరు: రైతులు పంటల సాగు కోసం అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి తెలిపారు. కొడవలూరులో శుక్రవారం ఆమె పర్యటించి సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కాండం తొలుచు పురుగు నివారణకు ఏ మందులు పిచికారీ చేయాలో వివరించారు. ప్రతి రైతు విధిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. దీనివల్ల బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. ఈ నెలాఖరుకు వరి కోతలు మొదలవుతున్న నేపథ్యంలో మిగిలి ఉన్న వారు కూడా పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం కేఎన్‌ఎం 1638 రకం సాగులో ఉన్నందున దీనికి మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉందన్నారు. పుట్టి ధర రూ.20,500 పలుకుతోందన్నారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి, ఏఈఓ ఎ.అనూష, వీఏఏ జి.కవిత, రైతులు కోవూరు వెంకీ, నక్కా రమణయ్య, అంబటి విజయకుమార్, కొప్పు రమేష్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌తో ఇల్లు భద్రం

- పోలీసుల నిరంతర పర్యవేక్షణకు యాప్
- విస్తృత అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొత్తం కిట్లు	63
పనిచేస్తున్నవి	38
అమర్చినవి	15
అందుబాటులో ఉన్నవి	23





ఎల్‌హెచ్‌ఎమ్మెస్ సేవలపై అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ పోలీసులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో తాళమేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని కొంతకాలంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో వీటి కట్టడే లక్ష్యంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎమ్మెస్)ను పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. వాస్తవానికి ఈ వ్యవస్థ ద్వారా చోరీలను కట్టడి చేయడంతో పాటు నిందితులను పట్టుకోవచ్చు. అయితే ఇంతటి ప్రాధాన్యం కలిగిన దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో వినియోగం నామమాత్రంగానే ఉంది.

ఎలా పనిచేస్తుందంటే..?

ఎల్‌హెచ్‌ఎమ్మెస్ ఏపీ పోలీస్ యాప్‌ను ప్లే స్టోర్, ఆపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం అందులో లాగిన్‌ై, వ్యక్తిగత వివరాలు, సెల్‌ఫోన్ నంబర్‌ను పొందుపర్చాలి. ఓటీపీని యాప్‌లో నమోదు చేస్తే పేరుతో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. అనంతరం ఊరెళ్లాలనుకునే ప్రజలు ముందుగా యాప్‌లోకి వెళ్లి రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీ.. ఏ సమయానికి ఊరెళ్తున్నారు.. తిరిగెప్పుడొస్తారు.. అనే వివరాలను పొందుపర్చాలి. ఈ సమాచారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అక్కడి నుంచి చిరునామా పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు వివరాలను అందిస్తారు. కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది స్వయంగా ఇంటికి చేరుకొని వైర్‌లెస్‌తో కూడిన మోషన్ కెమెరాను ఇంట్లోని ఓ మూలన అమర్చి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. కెమెరా పరిసర ప్రాంతాల్లో కదలికలు, థర్మల్ రేడియేషన్ కలిగిన వస్తువులు అటూ ఇటు కదలినా, వెంటనే అలారమ్ మోగుతుంది. యాప్‌ను వాడుతున్న వ్యక్తితో పాటు కంట్రోల్ రూమ్‌కు హెచ్చరికలెళ్తాయి. వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్, రక్షక్, బ్లూ కోల్ట్స్ మొబైల్‌కూ సమాచారం చేరుతుంది. దీని ద్వారా వారు అప్రమత్తమై దొంగలు చొరబడ్డ ఇంటి వద్దకు చేరుకొని వారిని పట్టుకోగలరు. దీంతో నేరం జరగకముందే అరికట్టినట్లవుతుంది. స్మార్ట్ ఫోన్లు లేని వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందిస్తే, ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌ను ఏర్పాటు చేస్తారు.

విస్తృత అవగాహన

ఎల్‌హెచ్‌ఎమ్మెస్ సేవలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో వినియోగించుకోలేకపోతున్నారు. వరుస చోరీల నేపథ్యంలో దీని సేవలపై జిల్లా పోలీస్ యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలు.. శివారు.. అపార్ట్‌మెంట్లు.. తదితరాల వద్ద అవగాహన సదస్సులను నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు.

చోరీలకు చెక్..

➡ బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు దుండగులు చోరీకి యత్నిస్తుండగా, ఎల్‌హెచ్‌ఎమ్మెస్ ద్వారా కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు అందాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై నిందితులను పట్టుకున్నారు.

➡ తాజాగా వెంకటేశ్వరపురంలోని ఇస్లాంపేటలో గల లక్ష్మీవీధిలో నివాసం ఉంటున్న శ్రీధర్ తన కుటుంబంతో కలిసి ఇటీవల ఊరెళ్లారు. దానికి ముందే తన ఫోన్లోని ఎల్‌హెచ్‌ఎమ్మెస్ యాప్‌లో రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌ను పెట్టారు. ఇంటికి పోలీసులు చేరుకొని వైర్‌లెస్‌తో కూడిన మోషన్ కెమెరాను అమర్చారు. ఈ తరుణంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి గురువారం తెల్లవారుజామున యత్నించగా, అలారం మోగడంతో పాటు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు హెచ్చరికలు వెళ్లాయి. నవాబుపేట పోలీసులు అప్రమత్తమై ఘటన స్థలానికి చేరుకునేలోపే దుండగులు పరారయ్యారు.



చోరీల కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న నవాబుపేట పోలీసులు

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టలో నివాసం ఉంటున్న అల్లానూర్ ఖాన్ స్థానికంగా చికెన్ పకోడా బండిని నిర్వహిస్తున్నారు. వ్యాపార, కుటుంబ ఆర్థికావసరాలకు అప్పులు చేశారు. ఈ తరుణంలో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇంటి నుంచి ఈ ఏడాది మార్చి 25న వెళ్లిపోయారు. బంధుమిత్రులు, స్నేహితులను ఆరాతీసినా ప్రయోజనం లభించలేదు. దీంతో చిన్నబజార్ పోలీసులకు తండ్రి ఖుదైనూర్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసును నమోదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి వివరాలను జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గోమతి సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ ఇండోర్ ఫీడర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఇస్కాన్ సిటీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

➡ హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న క్రమంలో నాగసాయి మందిరం, హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి



డీసీఓ కార్యాలయంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నగరంలోని జిల్లా సహకారశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీసీఓ గుర్రప్ప నివాళులర్పించారు.

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

నెల్లూరు(బారకాసు): నగరంలోని మెప్మా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీడీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మేయర్లు నందిమండలం భానుశ్రీ, అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు



మెప్మా కార్యాలయంలో..



జెడ్పీ కార్యాలయంలో..

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు అన్యాయం

మనుబోలు: మండలంలో 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా తొలగించారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఒక్కో పంచాయతీకి భారీగా నిధులు అందజేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పాడని, అయితే క్షేత్రస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. గతంలో జిల్లాలో రోజుకు సగటున 75 వేల పనిదినాలు కల్పిస్తుండగా.. ప్రస్తుతం అవి 10 వేలకు తగ్గిపోయాయన్నారు. టీడీపీ వారు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును రూ.3 లక్షలకు అమ్ముకున్నారని బీజేపీ నాయకుడు ఆరోపించారని, ఇది అధికారపక్షానికి సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఉపాధి పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌గా కిశోర్ కుమార్ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ స్టేషన్ పరిధిలో నేరాల కట్టడికి పటిష్ట చర్యలు చేపడతానని చెప్పారు. పాత నేరస్తులు, అసాంఘిక శక్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచుతామని వివరించారు.



భక్తిశ్రద్ధలతో గుంజ ప్రతిష్ట

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని పిండిమిల్లు సెంటర్‌లో నిర్వహించనున్న కృష్ణాష్టమి ఉట్టి మహోత్సవాలకు సంబంధించిన గుంజ ప్రతిష్టను వేడుకగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహోత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడారు. విశేష పూజా కార్యక్రమాలను ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహించనున్నామని వివరించారు. అప్పల సత్యనారాయణ, రమేష్, శేఖర్, అశోక్, దుర్గ, అనిల్, చరణ్, విజయ్, నాగరాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



జయహే.. జగన్మాత



రాజరాజేశ్వరి అలంకారం



రాజరాజేశ్వరి ఆలయంలో వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం

నెల్లూరు(బందావనం): శ్రావణమాస మూడో శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాల్లో కొలువైన జగజ్జననికి విశేష పూజలను నిర్వహించారు. సామూహిక లక్ష కుంకుమార్చనలను భక్తిప్రపత్తులతో చేపట్టారు. భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి.

➡ నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో గల అనివెట్టి మండపంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. సామూహిక లక్ష కుంకుమార్చనను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి, వేదపండితుడు అవ్వారి వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు కుంకుమ, జాకెట్, అమ్మవారి ఫొటో, తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, పూలంగి సేవ, చందనాలంకారం, పల్లకిసేవను నిర్వహించారు. పుష్పయాగాన్ని వేడుకగా రాత్రి జరిపారు.

➡ సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి మందిరంలో స్వర్ణ మహాలక్ష్మి మూలవర్లు, ఉత్సవమూర్తికి అభిషేకాలు, పూజలు, అర్చనలను నిర్వహించారు. సంకటహరచతుర్థిని పురస్కరించుకొని మహాగణపతికి ఉండ్రాళ్ల అభిషేకం, మహాగణపతి హోమాన్ని జరిపారు. ఉభయకర్తలుగా దోనిపర్తి గిరిప్రసాద్, వాణి దంపతులు వ్యవహరించారు. ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సామూహిక కుంకుమ, ఖడ్గమాల పూజను నిర్వహించారు. ఉభయకర్తలుగా చందలూరి నాగేంద్రరావు కుటుంబసభ్యులు వ్యవహరించారు. మందిర కమిటీ నిర్వాహకులు కిషోర్‌కుమార్, అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం తదితర ఆలయాల్లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.





అష్టలక్ష్మి ఆలయంలో..



సీతారామస్వామి మందిరంలో..

డాక్టర్ కృష్ణమూర్తికి సత్కారం

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డాక్టర్ కృష్ణమూర్తిని పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా సత్కరించామని చెప్పారు. గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నేతలు ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ప్రశాంతినగర్‌లోని చంద్రయ్యకు చెందిన ఖాళీ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందారు. 30 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి.. బ్లూ రంగు గళ్ల లుంగీ.. నలుపు, బ్లూ రంగు గళ్ల చొక్కాను ధరించి ఉన్నారు. మృతుడి కుడివైపు పక్కటెముకలు, పొట్టపై పుట్టుమచ్చలున్నాయి. ఈ విషయమై నవాబుపేట పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యంకాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96306, 94407 96310 నంబర్లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

